# ప్రేమ పరిష్వంగం

-ప్రేమ

"పోస్ట్"

పింక్ కవరును కిటికీ నుండి లోపలికి వేస్తూ పోస్ట్‌మెన్ కేక.

ఉదయ్ నుండి వచ్చే కవరది. పది రోజుల కోసారి కాస్త వూపిరినీ, కాస్త చైతన్యాన్ని ఆ కవరులో ఒంపి నాకు పోస్ట్ చేస్తూ వుంటాడు ఉదయ్.

లేకుంటే నా మనసు 'డ్రై' అయిపోతుందని అతనికి తెలుసు.

ఐదు సంవత్సరాలైంది ఉదయ్‌ని చూసి. ఆఖరి సారిగా... సముద్రపు చెంతన ఇసుక తిన్నెపై నా ఒడిలో పడుకుని, ఆకాశంలో జాబిల్లిని చూస్తూ కంట నీరు పెట్టుకున్న నా ఉదయ్‌ని చూస్తూ నే చెప్పిన మాటలు-



'నేస్తం! నీ కంటి నీటిని నా కంటిలోకి ఒంపుకోనివ్వు.

నీ హృదయంలో వేదనను నా గుండెలో దాచుకోనివ్వు.

నేను వెలివేయబడి నీ మనసుకు జత చేయబడ్డాను.

ఈ జన్మకింతే ప్రాప్తం అని సరిపెట్టుకుందాం. ఏం?-. అంటూ అతని కన్నీటిని తుడిచి, అతన్ని సంసార సాగరంలోకి నెట్టి- ఇదిగో...

చెలియలి కట్ట కీవల ఈ దూర తీరాన నేను నిలచి వున్నాను ఆకాశంలో ఒంటరి నక్షత్రంలా.

బహుశా బ్రహ్మదేవునికి మా మూర్తులను తయారుచేసిన తర్వాత ఆత్మలు సరిపోయి వుండవు. అందుకే మా రెండు శరీరాలలో ఆత్మ ఒక్కటే పెట్టి వుంటాడు. రాతలు వేరై... శరీరాలు దూరమై, ఆత్మ ఒక్కటైన జీవులం మేము. అపురూపంగా ఉత్తరాన్ని చేతిలోకి తీసుకున్నాను.

నా ప్రియ భామా!

ఎలా వున్నవురా?! వెన్నెలొచ్చినా... పండగొచ్చినా, నా గుండె గుండెలో నిలవదు. నిన్ను చూడాలనే భావం మనసులో ఉధృతమై- గుండెను గొంతులోకి నెట్టివేస్తోంది. ఈ క్షణాన ఎగిరి వచ్చి నీ ఎదపై వాలి, నాలోని ప్రతి అణువునూ నువ్వుగా మార్చేసుకోవాలని తపించిపోతున్నాను. సముద్రం నిండా నీళ్ళున్నా- వాన చినుకు పడనిదే ముత్యపు చిప్ప నుండి ముత్యం వుట్టదు. నా పరిస్థితీ అంతే. ఈ సంసార సాగరంలో ఈదుతున్నా- నా మనసు మాత్రం తీరని ప్రేమదాహంతో ఆర్చుకుపోతుంది. ఇంట్లో వుండలేక- ఈ పండగ సందడిలో ఇమడలేక ఈ సాయంత్రపువేళ వూరి వెలుపల చేలో నిలిచి, నా హృదయాన్ని గాలిపటం చేసి, సంధ్యా కిరణాలకు ముడివేసి నీ దగ్గరకు పంపాలని ఇంటి నుండి బయటపడ్డాను. ఊరి చివర పాడుపడిన సత్రపు అరుగు మీద ఎవరో బైరాగి- ప్రేమ పాట పాడుకుంటున్నాడు.

మబ్బులు కమ్ముకు వస్తున్నాయి.
ఈదురుగాలులు భూగోళాన్ని వూపివేస్తున్నాయి.
చంద్రునికోసం సముద్రంలో అలలు
ఆకాశాన్ని కబళించ ప్రయత్నిస్తున్నాయి.
ప్రేయసీ...
చందమామను గులాబీపువ్వుగా మార్చి
నా గుండెకు గుచ్చి నీ వాకిలి ముందు పెట్టాను
తొందరగా తలుపు తీసి వాటిని నీ చేతుల్లోకి చేర్చుకో!

ఎంత గొప్ప భావమో అనుకుని ఆ బైరాగి దగ్గరకు వెళ్ళాను.

ప్రేమచే నెట్టి వేయబడి– బైరాగిగా అవతరించినట్లుంది అతని వాలకం.

"ఓ బైరాగీ నీ వేందుకీ పాట పాడుతున్నావు? ఎవరి గుండె గాయం నుండి ఈ ప్రేమ పాట స్రవించింది?" అని అడిగాను.

అతడో లిప్తకాలం నాలోకి చూసి
"మావిగుమ్మ కొమ్మను మధుమాసవేళ
బల్లవమెక్కి కోయిలపాడుటేల?
పరుల దనియించుటకో? తన బాగు కొఱకే??
గానమొనరింపక బ్రతుకు గడవబోకో???–

అంటూ రాగం తీసి, నా భుజం తట్టి "వెళ్ళిరారా పిచ్చివాడా... వెర్రివాడా" అంటూ లేచి లోపలికి వెళ్ళిపోయాడు. భానూ మనమే కాదు, మనలాంటి పిచ్చివాళ్ళు ఈ లోకంలో ఇంకా ఎందరు వుండి వుంటారో కదూ?

ఏటి ఒడ్డున ఎత్తైన గుట్ట ఎక్కి కూర్చున్నాను. ఏటిలో వికసించబోయే కలువలు చూస్తే నీ కళ్ళు గుర్తుకు వచ్చాయి.

'నిన్ను ప్రేమిస్తున్నాను. నీ అమృత సహవాసంలో నా ప్రణయ రాగం పండింది'– అనే రెండు చరణాల స్మృహే నాకు లేకపోతే– నేను ఎప్పుడో ఆ నీట మునిగి నా ప్రాణాన్ని తీసుకునేవాడిని. కానీ నువ్వు ప్రక్కన లేనప్పుడు నేను మరణాన్ని మాత్రం ఎలా ఆహ్వానించగలను? నా ఆనందానికీ, అనురాగానికీ హేతువైన నా ప్రేమింకా– అదిగో... నీటిలో కలువలు వికసిస్తున్నాయి. ఆకాశం నుండి చంద్రుడు తన అనురాగాన్ని వెన్నెలగా వాటిపై కురిపిస్తున్నాడు. భానూ నువ్వు కావాలంటోంది నా మనసు. నిన్ను కోరుకుంటూ నా మనసు వేసే వెర్రికేక నీకు వినిపించలేదా? లాభం లేదు నేస్తం! ఈ ప్రకృతి అందం నన్ను వేధిస్తోంది. గుండెలోని విరహపు బరువును మోయలేక తిరిగి ఇంటికి ప్రయాణం. ఊరిలోకి ప్రవేశిస్తుంటే దీపావళీ వెలుగుల సందడి... ఇంటింటా అందరి ముఖాల్లోను ప్రకాశిస్తోంది. మరి అక్కడ నీ కళ్ళు? నీ కళ్ళల్లో వెలుగును ప్రేమ పేరున నేను హరించి– నీ జీవితంలో తిమిరావళిని నింపిన నాపై నీకింకా ప్రేమేమిటి? 'త్యజించి.... నీ జీవితాన్ని శుభప్రదం చేసుకో' అందామంటే, నువ్వు నాచే చేయించిన వాగ్దానం నన్ను పలకనీయటం లేదు. ఏమన్నావు నువ్వు? ఆహా కాదు, ఏమనిపించావు నా చేత నువ్వు?

"భానూ! ఎప్పుడూ దేనికీ... ఎవరికీ నిన్ను నేను త్యాగం చెయ్యను. చెయ్యలేను. జన్మ జన్మలకూ నువ్వు నా దానివే. నా దానివే" అని కదూ? ఎందుకు భానూ నా కోసమింత కఠిన నిర్ణయం తీసున్నావు? నువ్వు చేసిన త్యాగానికి నీకు దక్కిన ప్రతిఫలమేమిటి? బంధువులందరిచే వెలివేయబడటమే కదా? ఏం మిగిలిందని నీకు? రాత్రిళ్ళు లేని జీవితం తప్ప. బాధాతప్త హృదయంతో తపిస్తున్న నాకు... నీ దోసిలి నీళ్ళతో ఆతిథ్యమిచ్చి నన్ను సేద తీర్చిన నా హృదయదేవతా– నీ ప్రేమను పల్లకీ ఎక్కించి నా జీవితమంతా మోస్తాను. ఒక్కసారి నీ కఠిన హృదయాన్ని మార్చుకుని– నీ జీవితాన్ని ఒక వసంతచ్ఛాయ చెంత చేర్చుకుని నన్ను ఈ బాధ నుంచి విముక్తుణ్ణి చెయ్యి. చేస్తావనే ఆశతో....
నీ ఉదయ్.

> *"పెళ్ళి కూతురికి మేనమామ ఏం చదివించాడు?"
> "ఆ.... పంచరత్నాల్లే"
> "అబ్బో! పంచరత్నాలే! చాలా ఖర్చు పెట్టివుంటాడు"
> "పంచరత్నాలంటే పద్యాలయ్యా బాబు ఆయన కవిలే!"
> ఎస్.హనుమంత్రావ్

కళ్ళు మూసుకున్నాను. ఉత్తరాన్ని గుండెపై చేర్చుకుంటే కంటి రెటీనాపై ఉదయ్. నన్ను పోగొట్టుకోనూ లేక... ఒంటరిగా వదలనూ లేక విలవిల్లాడుతూ. ఉదయ్‌తో నా పరిచయం గుర్తుకువచ్చింది. ఎం.ఎ.లో నా క్లాస్‌మేట్. చాలాకాలం వరకూ ఉదయ్ అనే వ్యక్తి మా క్లాసులో వున్నాడని తెలియనే లేదు. ఒకరోజు కారిడార్‌లో నడుస్తున్న ఓ పెద్దమనిషి నన్నాపి – "అమ్మా ఉదయభానుడి క్లాసెక్కడో కాస్త చూపిస్తావా?" అని అడిగాడు. అతని చేతిలో శుభలేఖల బొత్తి వుంది.

"ఉదయభాను– పేరెప్పుడూ వినలేదు. ఏ క్లాసు?" అని అడిగాను.

ఆయన తన జేబు నుండి ఓ పేపరు తీసి విప్పి నా చేతికిచ్చాడు. పేపరు మడతల్లో ఉదయ్ ఫోటో కూడా వుంది. ఎడ్రస్ చూస్తే మా క్లాసుదే.

"అరే! మా క్లాసే. కానీ అతన్ని ఎప్పుడూ చూడలేదు. రండి మా క్లాసు చూపిస్తాను" అన్నాను. ఆయన నాతోపాటు నడుస్తూ
"నీ పేరేమిటమ్మా?" అని అడిగాడు.

"భానురేఖ"

"అయితే మా మేనల్లుడు పేరేనన్నమాట."

"మీ మేనల్లుడా. ఆయనెవరూ?" అని అడిగాను.

"అదేమిటమ్మా! ఉదయభాను నా మేనల్లుడు. నాకు కాబోతున్న అల్లుడు కూడా. ఇదిగో ఈ శుభలేఖలు అతని పెళ్ళి శుభలేఖలే. అతని స్నేహితులందరికీ పంచుదామని తీసుకువచ్చాను. ఉదయభానుడికి కూడా ఈ విషయం ఇంకా తెలియదు. ఏదీ... అనుకోకుండా అలా కలసి వచ్చేసింది. ఉదయ్ అక్కకి సంబంధం కుదిరింది. నేనే కుదిర్చాననుకో. పెళ్ళి కూడా నేనే చేయిస్తున్నాను. ఇద్దరికీ ఒక్కసారే చేస్తే ఖర్చు కలసి వస్తుందని. గంటల తేడా వుందనుకో..."

ఆయనింకా ఏదో చెప్తూనే వున్నాడు. పెండ్లి కొడుక్కి తెలియకుండా పెళ్ళేమిటి?! నాకాశ్చర్యమనిపించింది. అడగడం సభ్యత కాదని అడగలేదు.

క్లాసు రూంలోకి ప్రవేశించిన తర్వాత– ఆయనే ఉదయభానుని ముందు చూశారు.

"అదుగో వాడే అమ్మాయీ" అంటూ ఆయన వేలు పెట్టి చూపించిన వైపు చూశాను.

తలవంచి చదువుకుంటున్న అతను కాస్తా– ఈయన గొంతు చప్పుడుకి అనుకుంటా– తలెత్తి చూసాడు.

ఎంతోకాలం నుండి ఎరిగున్న భావన చప్పన స్ఫురించి, అంతలోనే చెదిరిపోయింది. ఒక అనిర్వచనీయ స్థితిలో పడిపోయాను నేను.

"నీ పెళ్ళిరా భానూ. అనుకోకుండా నీ అక్క పెళ్ళి కుదిరింది. ఎలాగూ నీ అక్క పెళ్ళి నా ఖర్చుతోనే అనుకున్నాం కనుక, మీ పెళ్ళి కూడా చేసేస్తే ఖర్చు కలసి వస్తుందనీ... ఇవిగో శుభలేఖలు. వచ్చే శుక్రవారమే ముహూర్తం. నీ స్నేహితులందరినీ తప్పక రమ్మని పిలు. ఇదిగో అమ్మాయి... కొన్ని నువ్వు తీసుకుని క్లాసులో ఆడపిల్లలందరికీ పంచమ్మా. తప్పకుండా మా వాడి పెళ్ళికి మీరంతా రావాలి"– అంటూ కొన్ని శుభలేఖలు నా చేతిలో పెట్టి–

"వస్తానురా మరి. ఇంకా చూసుకోవలసిన పన్లు చాలా వున్నాయి. మీ నాన్నకేమీ తెలియదు. అంతా నా నెత్తినేసుకు తిరుగుతున్నాననుకో. వచ్చే మంగళవారానికంతా ఊరుకొచ్చేయ్. మరి వస్తానమ్మా" అంటూ నాక్కూడా చెప్పి వెళ్ళిపోయాడాయన.

ఒక చైతన్యం సడన్‌గా స్తంభించిపోయినట్లు నిలుచుని శుభలేఖలను చూస్తున్నాడు ఉదయభాను. "భాను నా పేరు కూడా"– అన్నాను నన్ను నేను పరిచయం చేసుకుంటూ–

అతను కళ్లెత్తి నావైపు చూశాడు.

సంధ్యా సమయాన ఆకసాన ఎగిరేపక్షి బాణపు దెబ్బకు నేల కూలి గిల గిల తన్నుకునే దృశ్యం అతని ముఖంలో.

"ఈ పెళ్ళి ఇతనికి ఇష్టంలేదా?–" ఈ ప్రశ్నకు జవాబు అతని పెళ్ళిలో తెలిసింది. నల్లటి మచ్చల ముఖం.. మందమైన కళ్ళజోడు... ఎక్కడా ఆకారం లేకుండా పెరిగిన లావైన శరీరంతో ఆ అమ్మాయి– అతనికి భార్య. నాకే కాదు. పెండ్లి కొచ్చిన మా ఎవరికీ ఆ అమ్మాయి నచ్చలేదు.

"చాలా అన్యాయంరా. వీణ్ణి పీటల మీంచి లేపేసి వూరుకు తీసుకుపోదామనిపిస్తుందిరా. ఇందుకన్న మాట శుభలేఖలు చూసిన దగ్గర నుండీ ఒక్క మాట కూడా మాట్లాడలేదు. అయినా నోరు తెరిచి చెప్పొచ్చుగా ఆ అమ్మాయిని చేసుకునేది లేదు పొమ్మని. ఎంత మామయ్య కూతురయితే మాత్రం–"

"అప్పుడు అతని అక్క పెళ్ళి కాదు. వాళ్ల నాన్న చేసిన అప్పులు తీరవు. అసలు వాడప్పుడే చదువు చదవలేకపోయేవాడు. ఇంట్లిపాదీ కూలి పని చేసుకుని బ్రతకాల్సిన పరిస్థితి వచ్చేది బాబూ"

నా వెనక కూర్చున్న నా క్లాస్‌మేట్ మాటలకు, అతని ప్రక్కన కూర్చున్న ఉదయభాను బంధువి చ్చిన జవాబు.

"ఇది పెళ్ళి కాదు. త్యాగం, బలి" నా క్లాస్‌మేట్ గొణుక్కున్నాడు.

వారం రోజుల తర్వాత క్లాసులో – నా సీటు ప్రక్కన అడుగుల శబ్దానికి నా గుండెలు మువ్వలు రవళించినట్లయి తలెత్తి చూసాను. ఉదయభాను.

"ఎప్పుడు వచ్చారు?"– అప్రయత్నంగా అడిగాను. అతను జవాబు ఇవ్వలేదు. చిన్నగా నవ్వాడు... కళ్ళతో. ఆ కళ్ళల్లో నా ఆత్మ. నేను స్పష్టించడం లేదు కదా?


మర్నాడు ఉదయం క్లాసుకు వచ్చేసరికి షాకింగ్ న్యూస్.

ఉదయభాను నిద్రమాత్రలు మింగాడు. ప్రస్తుతం కోలుకుంటున్నాడు. అది వింటూనే నా గుండె ఎవరో పిండివేస్తున్న భావన. ముఖానికి పట్టున్న చెమటను తుడుచుకుంటూ అడిగాను.

"ఎందుకని? ఎందుకు ఉదయ్ ఆత్మ...హ...త్య–" నాకు మాటలు రావడం లేదు.

మా క్లాస్‌మేట్ వివరిస్తున్నాడు.

"అసలు అలాంటి తాటకి లాంటి భార్యను భరించటమే కష్టం. దానికి తోడు ఆ అమ్మాయి పెండ్లయిన మరుక్షణం నుండే – 'తన తండ్రి దయ వలనే ఉదయ్ అక్క పెండ్లయిందనీ, తను దయతలచి పెండ్లికి ఒప్పుకోవడం మూలం గానే ఉదయ్ చదువుకోగలుగుతున్నాడు' అనే గొప్ప అహంకారపు భావాన్ని, అధారిటీని ప్రదర్శించడం మొదలు పెట్టిందట. దానితో సున్నిత మనస్తత్వం గల ఉదయ్ ఆమెనూ... ఆమె అహంకారాన్ని జీవి తపు పొడుగునా తాను భరించలేననే నిర్ణయానికి వచ్చి ఈ పని చేసాడు"




మేమంతా ఉదయ్‌ని చూడడానికి అతనున్న నర్సింగ్‌హోమ్‌కి వెళ్ళాము.

మంచం పైన ఉదయ్.

జీవితపు రంపంతో కోసివేయబడిన మంచి గంధపు మానులా!

ఎంత విచిత్రం. ఎంతో ఆశ్చర్యం కూడా అనిపి స్తోంది. ఈ దేశంలో స్త్రీ లొక్కరే అన్యాయాలకూ, అక్రమాలకు గురి అవుతున్నట్లూ–

సీత నుండి ఆడపీత వరకూ– కష్టాలూ... కన్నీళ్ళూ.... ఆత్మహత్యలూ... కిరసనాయిలు చావులూ యివన్నీ ఒక్క ఆడవారికి మాత్రమే పరిమితమనుకున్నాను. కానీ ఇప్పుడు ఉదయ్‌ని చూస్తుంటే– మా నాన్న గుర్తుకు వస్తున్నారు. మా తాతగారు వంశోద్ధారకుడు కావాలనుకుని ఐదుమంది ఆడపిల్లలకు జన్మనిచ్చారు. వాళ్ళను పెంచి, పెండ్లిండ్లు చేసేసరికి– అమ్మమ్మ గంధపు చెక్కలా అరిగిపోయింది. ఆస్తి హారతి కర్పూర మయింది. నాన్నకు అప్పులు మిగిలాయి. చాలా కష్టపడి... చాలా ఆనందాలను వదులుకుని అతి కష్టం మీద జీవితాన్ని నిలబెట్టుకున్నారు నాన్న. నాకు తెలిసినంత వరకూ చాలా మంది మగవాళ్ళ బ్రతుకులు 'తలకొరివి పెట్టడం'– 'పున్నామ వరకం' – అనే నమ్మకాలకు బలి అవుతున్నాయి.

ఈ సృష్టిలో స్త్రీ పురుషుడి మూలంగా వేధించ బడుతోంది.

పురుషుడికి కూడా సుఖం లేదు. అతను కుటుం బానికీ... నమ్మకాలకూ, కుటుంబ పోషణకూ బందీ అయి బలి అవుతున్నాడు.

"ఆడపిల్లలా ఏంటిది ఉదయ్"– నా క్లాస్‌మేట్ నిర్మల అడుగుతోంది ఉదయ్‌ని. నిర్మలని తన్నా లనిపిస్తోంది.

అసలు మనసూ– దానికో స్పందనా వుండాలే గానీ... అవి ఎవరికున్నా 'జాతి' భేదం లేకుండా వాళ్ళు జీవితంలో ఎదురయ్యే కష్టాలకు బాధపడ తారు. శరీరానికి దెబ్బతగలడం వేరు. భరించగల గడం వేరు. కానీ హృదయం అలా కాదే. దానికి స్త్రీ పురుష విచక్షణ లేదు కదా?

ఆరోజు నుండీ నేను ఉదయ్‌ని రోజూ కలిసే దాన్ని. ఏ మహత్తర క్షణంలో మేము ఒకర్నొకరు చూసుకోవడం జరిగిందో నాకు తెలియదు. ఆ క్షణంలో ఏ ప్రేమ దేవతలు మా శిరస్సులపైన గగన విహారం చేస్తున్నారో అంతకన్నా తెలియదు. కానీ– ఆ క్షణంలోనే మేమిద్దరమూ ఒకే ఆశీర్వాదాన్ని పొంది వుంటాము. ఇది నిశ్చయంగా నిజం.

ఉదయ్‌కి వాళ్ళ మామ మీదిప్పుడు కోపం లేదు. తన భార్య మీద అసహ్యమూ లేదు. 'వాళ్ళకేమి కావాలో వాళ్ళు సాధించుకున్నారు. బలహీనులం కావటం మా దురదృష్టం. బలవంతులు కావటం వాళ్ళ అదృష్టం. ఈ సృష్టిలో బలవంతులదే కదా రాజ్యం. అయినా నేను అదృష్టవంతుడినే. నా జీవితంలో నేనింత కోల్పోకపోతే నువ్వు దొరికే దా నివా'? అంటాడు. నేనేం మాట్లాడగలను ఈ పిచ్చివానితో? నన్ను నేను మానసికంగా అర్పించు కోవడం తప్ప.

నా ఉనికి అతని జీవితానికి ఆలంబన.

నా వూహ అతని గమనానికి ఆధారం. ఇక– అతని ఆత్మత, సహవాసంలో పండిన జీవ ఘడి యలు చాలు... నా దుఃఖాల నుండి నన్ను నేను దూరం చేసుకుని బ్రతకటానికి.

ఉదయ్‌కి తెలుసు– అతన్ని చూసిన వెంటనే నాలోని నేను, అతనిలోని అతనితో తాదాత్మ్యం చెందామని. అయినా అప్పుడప్పుడూ– తనేదో నాకు అన్యాయం చేసినట్లు భావించుకొని బాధపడి పోతూ వుంటాడు. కారణం కూడా నాకు తెలుసు. అతను సంఘంతో కలసి జీవిస్తున్నాడు... కనుక బెండ్ అవుతున్నాడు. నేను సంఘంలో వున్నట్లు నటిస్తూ– నా చుట్టూ నేను గిరిగీసుకుని అందులో సృష్టిస్తున్నాను. నా నిబంధనలకు నేనే అధికారిణిని. ఇప్పుడు నన్ను మార్చటం ఉదయ్ తరం కాదు, పిచ్చ ఇదూ. నేను నీలపు కవరు తీసుకుని ఉదయ్‌కి రిప్లై రాసాను.

నా ఉదయ్!

నేను పెళ్ళి లేకుండా బ్రతకగలను. కానీ–

నీ ప్రేమ లేకుండా బ్రతకలేను.

నీ భాను

**ఉదయభాను**